## ముగిసిన నృత్య శిక్షణా తరగతులు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

వైరాటౌన్, జూన్ 7: నృత్య కళాభారవతి వైరా వారి ఆధ్వర్యంలో వైరా పాత సెంటర్ నందు రామాలయంలో ఏప్రిల్ 25 నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. కూచిపూడి, కుంభహారతి నృత్యం అంశములను ప్రదర్శించగా కళాభిమానులు తిలకించారు. శ్రీరామ భజన మండలి అధ్యక్షురాలు లోకా రమాదేవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్.నిర్మల చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఎం.హెచ్.ప్రసాద్ వాయిద్య సహకారం అందించగా ముందు తరాలకు నాటి ప్రాచీన కూచిపూడి నాట్యాన్ని నేతి తరానికి పరిచయం చేసిన నాట్య గురువు నటరాజును అందరూ అభినందించారు.

## విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దండి



బడిబాట ర్యాలీలో ఎంఈవో, ఉపాధ్యాయులు

సత్తుపల్లి, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో రాజేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని ఎన్టీఆర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, ఉపాధ్యాయులు సంయుక్తంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం లాంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సౌకర్యాలు ఉపయోగించుకొని వారి పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎన్టీఆర్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీర్ల సరోజిని గత నెల 31న రిటైర్డు అయినప్పటికీ బడిబాట కార్యక్రమంలో పాల్గొని అడ్మిషన్లు పెంచుతూ ఉపాధ్యాయ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, సత్యనారాయణరెడ్డి, పద్మావతి, హరిలాల్, సుధాకర్‌రెడ్డి, శేషు, నరసింహారావు, వెంకటేష్, లక్ష్మీ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాలల విద్యకు అధిక ప్రాధాన్యం

### 9, 10 తేదీల్లో కుక్, పారిశుధ్య కార్మికులకు శిక్షణ

### 'బడిబాట'లో సీఎంవో రాజశేఖర్

ఖమ్మం అర్బన్, జూన్ 7: రాష్ట్ర ప్రభుత్వం బాలల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని సీఎంవో యలగందుల రాజశేఖర్ అన్నారు. దీని కోసం రూ.వేల కోట్ల నిధులు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో తగిన వసతులు సమకూరుస్తోందని అన్నారు. సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని వీ వెంకటాయపాలెం, వేపకుంట్ల తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన ర్యాలీల్లో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం వండి అందించే కుక్‌కం హెల్పర్లు, పారిశుధ్య కార్మికుల్లో ప్రతి మండల నుంచీ ఎంపిక చేసిన వారిని పిలిపించి ఈ నెల 9, 10 తేదీల్లో ఖమ్మంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 10, 11 తేదీల్లో మండల స్థాయిలో, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. కాగా, బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతోపాటు అంగన్‌వాడీ, ఐకేపీ తదితర శాఖల సిబ్బందితో కలిసి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే, ఖమ్మం ఎన్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కూడా శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు రమణగుట్ట, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారు. హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు యలమద్ది వెంకటేశ్వర్లు, పూనాటి వెంకటేశ్వర్లు, నారాయణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

★Staff for reputed Homeopathy Clinic, Khammam. Homeopathy Doctors (BHMS/MD) -2, Receptionist (any Degree)-2, Manager-1, Cont: 9502755595
KMM-

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# మహిళా ఎస్సైపై దాడిని ఖండిస్తున్నాం

సత్తుపల్లిటౌన్, జూన్ 7: కల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళ ఎస్సైపై చేయి చేసుకొని దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక మహిళ అని చూడకుండా ఎస్సైపై దాడి దుర్మార్గమైన చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దోషులు ఎంతటి వారైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఏసీపీ రఘుకు వినతిపత్రం అందజేస్తున్న రత్న తారకరాజన్న

పెనుబల్లి, జూన్ 7: కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఎస్సై హరితపై దురుసుగా ప్రవర్తించిన యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ పోలీసు ప్రెస్ అండ్ మీడియా జాతీయ అధ్యక్షుడు రత్న తారకరాజన్న ఏసీపీ రఘును కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ అవమానకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్

### జిల్లా వ్యాప్తంగా బక్రీద్ వేడుకల్లో మత గురువులు



సత్తుపల్లి : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



వైరాటౌన్ : బక్రీద్ వేడుకల్లో ముస్లింలు



ఎర్రుపాలెం : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఇస్లాం మత గురువులు బోధించారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఉత్సవాలను అందరూ జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు శనివారం వేడుకలు నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాల ధరించి ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అందరూ సమూహంగా ఏర్పడి ప్రత్యేక నమాజులు ఆచరించారు. ఈ సందర్భంగా మత గురువులు ఇస్లాం బోధనలను వినిపించారు. రాగద్వేశాలు వీడనాడి ప్రతి ఒక్కరూ సామరస్య భావాలతో కలిసి మెలిసి జీవించాలని, తద్వారా సమాజంలో శాంతిని నెలకొల్పాలని ఆకాంక్షించారు. అలాగే, నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– నమస్తే నెట్‌వర్క్, జూన్ 7

## 'మదన్‌లాల్' మృతి పట్ల 'కందాళ' నివాళి




నివాళులర్పిస్తున్న కందాళ ఉపేందర్‌రెడ్డి

రఘునాథపాలెం, జూన్ 7: వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి.. శనివారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలోని మదన్‌లాల్ ఇంటికి వెళ్లారు. మదన్‌లాల్ ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 'ఏకరూపం బహుళ వైఫల్యం'పై విచారణ

### 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన




ఖమ్మం అర్బన్, జూన్ 7: విద్యాసంవత్సరం ముగిసినప్పటికీ.. గత ఏడాది విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తులు చాలా ప్రభుత్వ పాఠశాలలకు నేటికీ అందని అంశంపై 'ఏకరూపం.. బహుళ వైఫల్యం' పేరిట 'నమస్తే తెలంగాణ' శనివారం ప్రచురించిన కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేయిస్తామని ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను సమర్పించాలని దీనిపై జిల్లా సీఎంవో యలగందుల రాజశేఖర్‌ను డీఈవో ఆదేశించారు. నివేదిక రాగానే తగిన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

## రేపటి నుంచి డీసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం అర్బన్, జూన్ 7: డీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం డీసెట్-2025 కౌన్సెలింగ్‌ను ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఖమ్మం నగరంలోని డైట్ కళాశాల ఆవరణలో ఐదు రోజులపాటు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ ఐదు బృందాలను ఎంపిక చేశారు. ప్రతి రోజూ సుమారు 500 మందికిపైగా విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. డైట్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులతోపాటు నాన్ టీచింగ్ సిబ్బందిని ఈ ప్రక్రియ కోసం నియమించారు. డైట్ కళాశాలను డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ శనివారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 14 నుంచి 17 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోనున్నారు. ఈ నెల 20న డీసెట్ సీట్ అలాట్‌మెంట్ ప్రకటించనున్నారు.

## గౌడ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

### మాజీ ఎమ్మెల్సీ బాలసాని




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసాని

రఘునాథపాలెం, జూన్ 7 : రఘునాథపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వం గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించే గౌడ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ జిల్లా గౌడ కులస్తులకు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం నగరంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రఘునాథపాలెంలోని ప్రధాన రహదారికి ఆనుకొని 29కుంటల ప్రభుత్వ భూమిని కేటాయించిందన్నారు. ఆ స్థలంలో 9వ తేదీన శంకుస్థాపన జరుగుతుందన్నారు. సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు కత్తుల నెహ్రూ, మార్కం లింగయ్యగౌడ్, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ముగ్గురు విలేకరులపై కేసు

మామిళ్లగూడెం, జూన్ 7: నగరంలోని ముగ్గురు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ బాలకృష్ణ శనివారం తెలిపారు. నగరంలోని ఓ టీ స్టాల్ వద్ద వాహనం పార్కింగ్ విషయంలో ఇంటి యజమానికి, పై విలేకరులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో తనతో ఘర్షణకు దిగిన ముగ్గురు విలేకరులపై ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఇంటి యజమానిపై కూడా విలేకరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సత్కారం



విద్యార్థిని సత్కరిస్తున్న పలువురు ప్రముఖులు

మధిర, జూన్ 7: మధిర పట్టణానికి చెందిన కొత్తూరు జగన్, సంధ్యల కుమారుడు సాయి వరుణ్‌తేజ జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా 320 ర్యాంక్ సాధించిన సందర్భంగా శనివారం మధిర పట్టణంలోని అభిరామ్ టవర్స్‌లో మధిర సేవాసమితి అధ్యక్షుడు పల్లపోతుల ప్రసాదరావు , పట్టణ ప్రముఖుల సమక్షంలో విద్యార్థిని సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇంకా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్లపోతుల ప్రసాదరావు, వనమా వేణుగోపాలరావు, కురువెళ్ల కృష్ణ, లింగంపల్లి అప్పారావు, వంగవేటి రాజశేఖర్, సామినేని రామనాథం, నేరేళ్ల శ్రీనివాసరావు, కుంచం కృష్ణారావు, చల్లా సత్యనారాయణ, మాచర్ల శ్రీనివాసరావు, బాణాల శంకరాచారి, పబ్బతి రమేష్, జల్లా రాధాకృష్ణమూర్తి, వేముల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల వ్యాన్ ఢీకొని ఇద్దరు మృతి

వేంసూరు, జూన్ 7: కోళ్ల వ్యాన్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన వేంసూరు మండలంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని భరణిపాడు గ్రామానికి చెందిన మల్లెపూల సాత్విక్, సూరటి జగదీష్, విస్సంపల్లి జస్వంత్ ముగ్గురు స్నేహితులు. శనివారం మర్లపాడు గ్రామంలో క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ముగ్గురు బైక్‌పై వెళ్తున్నారు. కందుకూరు గ్రామం దాటాక మర్లపాడు దగ్గరలో భరణిపాడు వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా మల్లెపూల సాత్విక్(22) అక్కడిక్కడే మృతిచెందారు. సూరటి జగదీష్(21) పరిస్థితి విషమించడంతో ఖమ్మం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందగా విస్సంపల్లి జస్వంత్ సత్తుపల్లి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో..

### 40.44 శాతం, 57.93 శాతం ఉత్తీర్ణత

ఖమ్మం అర్బన్, జూన్ 7: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలైనట్లు డీఈవో సామినేని సత్యనారాయణ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఓపెన్ టెన్త్‌లో 596 మంది విద్యార్థులకు 241 మంది పాసయ్యారు. 40.44 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఓపెన్ ఇంటర్‌లో 839 మందికి గాను 486 మంది పాసయ్యారు. 57.93 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్ కోసం ఈ నెల 12 నుంచి ఈ నెల 18 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈవో, కో ఆర్డినేటర్ సూచించారు.

## ఎదురుకాల్పుల్లో

## ఐదుగురు మావోయిస్టులు మృతి

### ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 7 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో జవాన్లను గుర్తించిన మావోయిస్టులు వెంటనే కాల్పులకు దిగారు. దీంతో జవాన్లు సైతం కాల్పులు ప్రారంభించడంతో ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అటవీ మార్గం గుండా పారిపోయారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా.. అందులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు బీజాపూర్ జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఐదుగురి మృతదేహాలతోపాటు రెండు ఏకే-47 గన్‌లు, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో కొందరు జవాన్లు సైతం పాముకాటుకు గురికావడం, కందిరీగల బారినడిపడడం, డీహైడ్రేషన్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

పాల్వంచ రూరల్, జూన్ 7 : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని రంగాపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన ముసుము అశోక్‌రెడ్డి తన భార్య అఖిలతో కలిసి శుక్రవారం రాత్రి బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో పాల్వంచ వస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి అశోక్‌రెడ్డి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం కొత్తగూడెంలోని ఆసుపత్రికి తరలించారు. అశోక్‌రెడ్డి బాబాయి రామకోటిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు బోడుగ్రామానికి చెందిన గడ్డం సంతోష్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉదయ్‌కుమార్ రెడ్డి సేవలు శ్లాఘనీయం



రామచంద్రాపురంలో మెదక్ ఎస్పీగా పదవీ విరమణ చేసిన ఉదయ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న సీపీ సునీల్ దత్

కూసుమంచి, (నేలకొండపల్లి), జూన్ 7: వృత్తిలో నిబద్ధత, పట్టుదల, సేవాభావం కలిగిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సేవలు శ్లాఘనీయమని సీపీ సునీల్ దత్ అన్నారు. మెదక్ ఎస్పీగా పనిచేసి పదవీవిరమణ చేసిన ఉదయ్‌కుమార్ రెడ్డి దంపతులకు శనివారం నేలకొండపల్లి మండలం రామచంద్రాపురంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో మమేకమై పోలీస్‌శాఖలో తనదైన శైలిలో మంచి పేరు తెచ్చుకున్న ఉదయ్‌కుమార్ రెడ్డి శేషజీవితం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సీఐ సంజీవ్, ఎస్సై సతోశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనానికి వేంసూరు విద్యార్థులు



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

వేంసూరు, జూన్ 7: నవంబర్ 2024లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన పరీక్షా ఫలితాలు ప్రకటించారు. ఈ ఫలితాల్లో వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బీ.కే.నరసింహారావు శనివారం తెలిపారు. విద్యార్థులు ఎస్.కే.సల్మాన్, ఎస్.కే.నీహాల్, జీ.నాగలక్ష్మీప్రసన్న, గోకవరపు రిషిత, కుర్నవెల్లి చరణ్య ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాలు స్కాలర్‌షిప్ అందుతుంది. ఎంపికైన విద్యార్థులను ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హుస్సేన్‌బీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## 14న మధిర కోర్టులో జాతీయ లోక్ అదాలత్

తల్లాడ, జూన్ 7: ఈ నెల 14న మధిర కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, దీనిని తల్లాడ పీఎస్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తల్లాడ ఎస్సై తెలిపారు. కేసులకు సంబంధించి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

## చిట్టెమ్మ మృతికి నివాళి

తల్లాడ, జూన్ 7: మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామానికి యింజం చిట్టెమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గంగమ్మతల్లి ప్రతిష్ఠలో కోదాడ మాజీ ఎమ్మెల్యే



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

కూసుమంచి,(నేలకొండపల్లి), జూన్ 7: నేలకొండపల్లిలోని మహామునీత గంగమ్మ తల్లి గుడి విగ్రహ ప్రతిష్ఠలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని పూజలు చేశారు. స్థానిక యాదవ సంఘం బాధ్యులు మల్లయ్య యాదవ్‌కు స్వాగతం పలికి సత్కరించారు. సంఘం బాధ్యులు లిక్కి వీరబాబు యాదవ పెద్దలు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మధిర(చింతకాని), జూన్ 7: చింతకాని మండల పరిధిలోని ఓ గ్రామంలోని మైనర్‌పై లైంగికదాడి యత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు వైరా సీఐ సాగర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ చింతకాని మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న మైనర్‌పై లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. మైనర్ కేకలు వేయడంతో పరిసర ప్రాంత ప్రజలు ఇర్ఫాన్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చింతకాని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వైరా సీఐ తెలిపారు.

## యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



మండలంలో నిర్వహిస్తున్న సైకిల్‌యాత్ర

బోనకల్లు, జూన్ 7: జిల్లాలో మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగాని వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో యువతను కాపాడాలంటూ డీవైఎఫ్ఐ చేపట్టిన యువ చైతన్య సైకిల్‌యాత్ర శనివారం మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చేరుకుంది. ఈ సైకిల్‌యాత్ర మండలంలోని రావినూతల, పెద్దబీరవల్లి, గోవిందాపురం-ఎల్, లక్ష్మీపురం, తూటికుంట్ల గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రావినూతల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి అనగాని వెంకటేష్, డీవైఎఫ్ఐ సైకిల్ యాత్ర బృందం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో షేక్ బషీరుద్దీన్, పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, మడుపల్లి గోపాలరావు, తాళ్లూరి రమేష్, జొన్నలగడ్డ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఖమ్మం రూరల్, జూన్ 7: ఇటీవల వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబాలకు శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. పది గ్రామాలకు చెందిన 20 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ హరినాథబాబు, బాణోత్ కిశోర్, సురేష్ నాయక్, జగదీష్, అశోక్, వెంపటి రవి, తమ్మినేని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు భూమిపూజ

తిరుమలాయపాలెం, జూన్ 7: మండలంలోని సుబ్లేడులో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి శనివారం బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంత్రి పొంగులేటి సహకారంతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసీ ఈఈ విన్సెంట్‌రావు, ఏఈ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.